తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
బుధవారం
11 మార్చి 2026
Follow :



# భార్య హత్య కుట్ర భగ్నం

- అంబర్‌పేట్ పోలీసుల సత్వర చర్యలో రియల్ ఎస్టేట్ వ్యాపారి అరెస్టు
- దేశీయ తుపాకీ, ఆరు లైవ్ కార్ట్రిడ్జ్‌లు స్వాధీనం
- మీర్ ముజమ్మిల్, మహమ్మద్ అబ్బు సహాయంతో పన్నిన పథకం






**అంబర్‌పేట్, మార్చి 10 (జనం సాక్షి):** రెండవ భార్యను హత్య చేయాలని పన్నిన కుట్రను అంబర్‌పేట్ పోలీసులు భగ్నం చేశారు. వాహనాల తనిఖీల సమయంలో దేశీయ తుపాకీ, లైవ్ కార్ట్రిడ్జ్‌లతో రియల్ ఎస్టేట్ వ్యాపారి పట్టుబడటంతో ఈ సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు సమయానికి అప్రమత్తంగా వ్యవహరించడంతో భారీ నేరం తప్పిందని అధికారులు తెలిపారు. మార్చి 9 సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో అంబర్‌పేట్‌లోని అలి కేఫ్ సమీపంలో అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ ఎన్. అంజి రెడ్డి నేతృత్వంలో క్రైమ్ టీమ్ సిబ్బంది వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో అనుమానాస్ప దంగా వస్తున్న తెల్లరంగు ఎలక్ట్రిక్ వాహనం (టీఎస్ 08 జేహెచ్ 1929)ను ఆపి తనిఖీ చేయగా డిక్కీలో దేశీయంగా తయారు చేసిన తుపాకీ (కంట్రీ మేడ్ పిస్టల్)తో పాటు ఆరు లైవ్ కార్ట్రిడ్జ్‌లు లభ్యమయ్యాయి. వాహనం నడుపుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

విచారణలో అతను తనను ధమర అరుణ్ కుమార్ (48), రియల్ ఎస్టేట్ వ్యాపారి, మల్కాజ్‌గిరి మారుతి నగర్ నివాసి అని తెలిపాడు. తన రెండవ భార్య నిషితా రాణిని హత్య చేయాలని పథకం రచించినట్లు ఒప్పుకున్నాడు. మల్కాజ్‌గిరికి చెందిన మహమ్మద్ అబ్బు, యాకుత్‌పురకు చెందిన మీర్ ముజమ్మిల్ అనే వ్యక్తులు ఆయుధం సమకూర్చినట్లు బయటపడింది. మీర్ ముజమ్మిల్ బీహార్ రాష్ట్రంలోని ముంగేర్ ప్రాంతం నుంచి దేశీయ తుపాకీ, కార్ట్రిడ్జ్‌లు కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకువచ్చి అరుణ్ కుమార్‌కు అందజేసినట్లు విచారణలో వెల్లడైంది. పోలీసులు నిందితుడి వద్ద నుంచి ఒక దేశీయ తుపాకీ, ఆరు లైవ్ కార్ట్రిడ్జ్‌లు, ఒక ఎలక్ట్రిక్ వాహనం మరియు మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మిగతా నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. అంబర్‌పేట్ పోలీసుల అప్రమత్తతతో ఈ ఘటనలో పెద్ద నేరం తప్పిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



## పోస్ట్‌మాన్ నిర్లక్ష్యంతో ఉద్యోగం కోల్పోయిన వీరేశం

- రామ్‌నాథ్ గుడిపల్లి పోస్ట్‌మాస్టర్ కొండారెడ్డిపై చర్యలు తీసుకోవాలి
- కాల్ లెటర్ అందకుండానే ఆన్‌లైన్ డెలివరీ రికార్డు
- బూతులు, బెదిరింపులు.. ఉన్నతాధికారులకు ఫిర్యాదు

**మోమిన్‌పేట్, మార్చి 10 (జనం సాక్షి):** రామ్‌నాథ్ గుడిపల్లి గ్రామ పోస్ట్‌మాస్టర్ కొండారెడ్డి నిర్లక్ష్యం కారణంగా ఉపాధి అవకాశం కోల్పోయిన వీరేశం ఉన్నతాధికారులను ఆశ్రయించి న్యాయం కోరాడు. మంగళవారం వికారాబాద్ సబ్ డివిజన్ పోస్ట్ ఆఫీసులో ఫిర్యాదు చేసిన వీరేశం తనకు మార్చి 4న ఉద్యోగం కోసం కాల్ లెటర్ వచ్చినప్పటికీ స్థానిక పోస్ట్‌మాస్టర్ పెండ్లి మడుగు కొండారెడ్డి నిర్లక్ష్యం వల్ల లెటర్ అందలేదని తెలిపాడు. తీరా గమనించగా కాల్ లెటర్ ఆన్‌లైన్‌లో డెలివరీ అయినట్లు రికార్డు చేసినట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకుని వికారాబాద్ ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయగా పోస్ట్‌మాస్టర్ కొండారెడ్డి "నాపై ఫిర్యాదు చేస్తావా?" అంటూ బూతులు తిట్టి, హేళన చేసి బెదిరించాడని వీరేశం ఆరోపించాడు. మార్చి 9న గమనించగా మార్చి 4నే లెటర్ స్వీకరించినట్లు రికార్డులు చూపించారని, ఇలా ఎందుకు చేశావని నిలదీయగా "నా ఇష్టం వచ్చినట్లు రాసుకున్నాను.. ఎవరితో చెప్పుకుంటావో చెప్పుకో" అని బెదిరించాడని వీరేశం వివరించాడు.మార్చి 4న లెటర్ ఇవ్వలేని పోస్ట్‌మాస్టర్ కొండారెడ్డిపై చర్యలు తీసుకొని తనకు తగిన న్యాయం చేయాలని వికారాబాద్ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయంలో తనకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తానని వీరేశం స్పష్టం చేశాడు. స్థానికులు కూడా పోస్ట్‌మాస్టర్ నిర్లక్ష్యం కారణంగా అనేకమంది ఇలాంటి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# 99 రోజుల ప్రజా పాలనకు గ్రామస్తుల సహకారం కావాలి

- లింగంపల్లి గ్రామ అభివృద్ధికి సమిష్టి కృషి
- పారిశుద్ధ్య కార్యక్రమం విస్తృతంగా
- ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్న సర్పంచ్
- ఖాళీ ప్లాట్లు శుభ్రం చేయాలని హెచ్చరిక



**వికారాబాద్, మార్చి 10 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యచరణలో భాగంగా వికారాబాద్ జిల్లా నవపేట్ మండలంలోని లింగంపల్లి గ్రామంలో విస్తృతంగా పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్ వడ్ల శోభా పరమేశ్వర్, గ్రామ పంచాయతీ సెక్రటరీ వెంకటలక్ష్మి వార్డు సభ్యులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలోని ప్రతి ఖాళీ స్థలాన్ని శుభ్రం చేయాలని కాళీ ప్లాట్ల యజమానులకు హెచ్చరికలు జారీ చేశారు. సర్పంచ్ వడ్ల శోభా పరమేశ్వర్ మాట్లాడుతూ "మన గ్రామంలో పెద్దలు, యువకులు, యువత, మహిళలు, నా ప్రియమైన ఓటర్లందరూ 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో సహకరించాలి. అందరూ కలిసి కృషి చేస్తేనే మన గ్రామం అభివృద్ధి పథంలో నడుస్తుంది. రానున్న రోజుల్లో వచ్చే పథకాలు, నిధులు సకాలంలో అందేలా చూస్తాం. మీ సహకారంతోనే లింగంపల్లిని అభివృద్ధి చేసుకుందాం" అని ప్రజలను వేడుకున్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు, ఉప సర్పంచ్ ప్రవీణ్ కుమార్, వార్డు సభ్యులు గౌతమీ శంకర్ గౌడ్, మల్లమ్మ, మానయ్య, కాంతి, పాండు, గోవింద్ రెడ్డి, కండ్లపల్లి పాండు, తలారి పాండురంగం తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమం విస్తృతంగా చేపట్టి ప్రధాన రహదారులను పరిశుభ్రం చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఇంకా అనేక అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు సర్పంచ్ తెలిపారు.

## సీఎం రేవంత్ రెడ్డి రైతాంగాన్ని మోసం చేస్తున్నాడు

- రైతు భరోసా నిధులను రైతుల ఖాతాలో వెంటనే వేయాలి
- రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి



**మహేశ్వరం, మార్చి 10 (జనంసాక్షి):** సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులను రైతుల ఖాతాలో వేయకుండా రైతాంగాన్ని మోసం చేస్తున్నడాన్ని రంగారెడ్డి జిల్లా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి అన్నారు.మంగళవారం మహేశ్వరం మండలంలోని మొహబ్బత్ నగర్, మహేశ్వరం, తుమ్మలూరు, గట్టుపల్లి, ఆకాన్ పల్లి, కోళ్లపడకల్, దుబ్బచర్ల, మన్సాన్ పల్లి గ్రామాలలో రైతు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి మాట్లాడుతూ...రైతాంగంపైన సీఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదన్నారు.ఎన్నికల కోడ్ ముగిసిన రైతు భరోసాను రైతుల ఖాతాలో వేయకుండా కాలయాపన చేస్తున్నాడన్నాడు. 9000 వేల కోట్ల రైతు భరోసా నిధులను సీఎం రేవంత్ రెడ్డి ఏమి చేశారో రైతాంగానికి సమాధానం తెలపాలన్నారు.యాసంగి పంట చివరిదశకు వచ్చిన రైతు భరోసాను విడుదల చేయలేదన్నారు.యూరియా బస్తాల కోసం రైతులు అష్ట కష్టాలు పడుతున్నారన్నారు. యూరియా సరఫరాలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు రామచందర్, విజయ్, అశోక్, నరేందర్, ముజీజ్,రమేష్ పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా పంపిణీ

- రాష్ట్ర ప్రభుత్వం తరపున బోడుప్పల్ సర్కిల్‌లో కార్యక్రమం
- కాంగ్రెస్ నాయకుల ఘన సహకారం




**బోడుప్పల్, మార్చి 9 (జనం సాక్షి):** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఉప్పల్ జోన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని ప్రధాన రహదారి ఎన్టీఆర్ విగ్రహం సమీపంలోని మజీద్ హీకుతాబ్ షాహీ అలంగీర్ వద్ద మరియు చెంగిచర్ల మజీద్ ఈ బిల్లాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరపున ముస్లిం సోదరులకు రంజాన్ "తోఫా" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ తో పాటు మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ హాజరై ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా హజ్ కమిటీ మెంబర్ మహమ్మద్ ముజీబుర్రహ్మాన్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, అలియాబాద్ మున్సిపాలిటీ చైర్మన్ శిరీష కృష్ణారెడ్డి, కొత్త ప్రభాకర్ గౌడ్, విశ్వం గుప్త, మాజీ కార్పొరేటర్లు కొత్త చందర్ గౌడ్, బింగి జంగయ్య యాదవ్, బొమ్మకు కళ్యాణ్, సీసా వెంకటేష్ గౌడ్, సింగిరెడ్డి పద్మారెడ్డి, చీరాల నరసింహ, సుమన్ నాయక్, పుల్లకండ్ల జంగారెడ్డి, గుర్రాల వెంకటేష్ యాదవ్, హరినాథ్ రెడ్డి, బొమ్మకు శ్రీనివాస్, రాపోలు ఉపేందర్, సింగిరెడ్డి రాజు రెడ్డి, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముస్లిం మత పెద్దలు, మసీదు కమిటీ సభ్యులు మరియు ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### చదువుల తల్లి

## సావిత్రి బాయి పూలేకు ఘన నివాళులు



**హయత్ నగర్, మార్చి 10 (జనంసాక్షి):** క్రాంతి జ్యోతి, భారత దేశ మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయరాలు సావిత్రి బాయి పూలే 129 వ వర్ధంతి సందర్భంగా పూలే యువజన సంఘం ఆధ్వర్యంలో మన్సూరాబాద్ సహారా రోడ్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బి ఎన్ రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న రామ్మోహన్ గౌడ్, బొంగు వెంకటేష్ గౌడ్, పిడికిలి రాజు, మేడిగ శ్రీధర్, శనిగరపు స్వామి లుపాల్గొని, సావిత్రి భాయి పూలే విగ్రహానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులు అర్పించారు.

## పార్టీ బలోపేతంపై బీజేపీ సన్నాహక సమావేశం



**రాజేంద్రనగర్, (జనంసాక్షి):** డివిజన్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, బూత్ స్థాయి వరకు పార్టీ కార్యక్రమాలను విస్తరించడం, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడం లక్ష్యంగా బీజేపీ మైలార్దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు సురెడ్డి వినయ్ రెడ్డి పేర్కొన్నారు. కాటేదాన్‌లో జరగనున్న డివిజన్ కార్యవర్గ సమావేశం ఏర్పాట్లపై ఈ సమావేశంలో నాయకులు విస్తృతంగా చర్చించారు. కార్యవర్గ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు, నాయకులు కార్యకర్తల సమన్వయం, కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. ఈ సమావేశానికి ఇన్‌చార్జ్‌గా జోగు రవి కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎ.రాజు, బల్ల శ్రీనివాస్ యాదవ్, ఎ.మహేందర్, వల్లూరి శ్రీనివాస్, గూడూరి అంజయ్య పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

## విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



**శామీర్ పేట్, (జనంసాక్షి):** మూడు చింతలపల్లి హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్ లను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జెర్రిపోతుల నరసింహులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధు లుగా మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్, ఎంసి పల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేష్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెర్రి పోతుల నర్సింలు మాట్లాడుతూ ..10వ తరగతిలో ఫస్ట్ వచ్చిన విద్యార్థులకు 5016 నగదు ఇస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు మంచిగా చదువుకొని మన గ్రామానికి పేరు తేవాలని తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న ఆశలు నెరవేర్చాలన్నారు. చదువు చాలా గొప్పది చదువు లేకపోతే మనం సమాజంలో పేరు ప్రతిష్ట లను కోల్పోవడం జరుగుతోందని, మంచిగా చదువు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహులు యాదవ్, ఎంసి పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దోసకాయల వెంకటేశం, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆర్. శ్రీకాంత్ గౌడ్, మాజీ ఎంపీటీసీ అఖిలేష్ రెడ్డి, హరిబాబు,బస్వారెడ్డి,ప్రవీణ్ రెడ్డి, దామోదర్ రెడ్డి, జె.వెంకటేష్,మేడిపల్లి రాజు, మహేష్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్కే నగర్‌లో ప్రభుత్వ పాఠశాల నిర్మించాలి: సిపిఐ

**అబ్దుల్లాపూర్ మెట్, మార్చి 10(జనంసాక్షి):** వేలాది నిరుపేదలు నివసిస్తున్న ఆర్కే నగర్‌లో ఇప్పటివరకు ప్రభుత్వ పాఠశాల లేకపోవడం దురదృష్టకరమని, వెంటనే అక్కడ పదో తరగతి వరకు అన్ని సౌకర్యాలతో ప్రభుత్వ పాఠశాలను నిర్మించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అబ్దుల్లాపూర్ మెట్ మండల ప్రధాన కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళ వారం ఆర్కే నగర్‌లో జరిగిన సిపిఐ శాఖ సమా వేశం శాఖ సహాయ కార్యదర్శి పేరాల గోపి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అజ్మీరా హరిసింగ్ నాయక్ సిపిఐ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఆర్కే నగర్ ఏర్పడి దాదాపు 20 సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ అక్కడ ప్రభుత్వ పాఠశాల లేకపోవడం వల్ల చిన్నపిల్లలు చదువు కోసం బస్సులు, ఆటోలు ఎక్కి ఆనారం, నాగోల్ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. చిన్న వయసు పిల్లలకు ఇది తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు.దేశంలో మెజారిటీ ప్రజలకు ఇప్పటికీ కూడు, గూడు, ఉపాధి, విద్య, వైద్యం వంటి కనీస వసతులు అందు




బాటులో లేవని ఆయన పేర్కొన్నారు. సమాజంలో అసమానతలు, దోపిడీ ఉన్నంతకాలం ప్రజా పోరాటాలు కొనసాగుతూనే ఉంటాయని చెప్పారు. కమ్యూనిస్టు పార్టీ ప్రజా ప్రతినిధులు ఉన్న ప్రాంతాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొంటూ రాబోయే హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికలను లక్ష్యంగా చేసుకొని పెద్ద అంబర్‌పేట్ 52వ డివిజన్‌లో సిపిఐ అభ్యర్థిని గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.అలాగే రావి నారాయణ రెడ్డి భూ పోరాట కేంద్రం ఫేజ్--3లో ఇళ్లులేని నిరుపేదలకు ప్రభుత్వం పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చే వరకు భూ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ ఆర్కే నగర్ శాఖ కార్యదర్శి భైరగోని రాజు గౌడ్ మాట్లాడుతూ, ఆర్కే నగర్‌లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, నీళ్లు రోడ్లపై పారుతున్నాయని చెప్పారు. తాగునీటి సమస్యను కూడా ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆర్కే నగర్‌లో ఉన్న అనేక సమస్యల పరిష్కారం కోసం సిపిఐ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో భైరగోని రాజు గౌడ్, ప్రజా నాట్య మండలి కళాకారుడు గణేష్, సిపిఐ నాయకులు కారంపొడి నర్సింహా, ఉప్పలయ్య, కనకయ్య, మల్లేష్, జమీల, శ్రీలత, శైలజ, మల్లీశ్వరి, అనసూర్య, వెంకటమ్మ, రమేష్, నర్సింహా, అంజమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.



### రద్దీని ఆసరాగా చేసుకున్న దొంగలు...

## మహిళ బ్యాగులోని బంగారం మాయం

- ప్రయాణికులను వణికిస్తున్న చోరీలు
- మహిళా ప్రయాణికురాలి బ్యాగులోని బంగారం అపహరణ



**ఉప్పల్, (జనంసాక్షి):** నగరంలోని ఉప్పల్ రింగ్ రోడ్డుపై దొంగల బెడద రోజురోజుకు పెరుగుతూ ప్రయాణికులను వణికిస్తోంది. రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో దుండగులు చాకచక్యంగా దొంగతనాలకు పాల్పడుతూ ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తున్నారు. తాజాగా హన్మకొండకు వెళ్లేందుకు బస్సు ఎక్కిన ఒక మహిళా ప్రయాణికురాలిని లక్ష్యంగా చేసుకుని దుండగులు ఆమె బ్యాగులో ఉన్న విలువైన వస్తువులను అపహరించిన ఘటన కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, ఉప్పల్ రింగ్ రోడ్డుపై బస్సు ఎక్కేందుకు వచ్చిన ఒక మహిళా ప్రయాణికురాలు హన్మకొండకు వెళ్లేందుకు బస్సులో ఎక్కుతున్న సమయంలో గుర్తుతెలియని దుండగులు ఆమె బ్యాగును టార్గెట్ చేశారు. ఆమెకు తెలియకుండా బ్యాగులో ఉన్న పర్సును చాకచక్యంగా కాజేశారు. ఆ పర్సులో సుమారు రెండు తులాల బంగారం ఉన్నట్లు సమాచారం. ఈ ఘటన తర్వాత మహిళ తీవ్ర ఆందోళనకు గురైంది. చుట్టు పక్కల ఉన్నవారికి విషయం తెలియజేయగా, స్థానికులు కూడా ఆశ్చర్యానికి గురయ్యారు. నిత్యం రద్దీగా ఉండే ఉప్పల్ రింగ్ రోడ్డుపై ఇలాంటి దొంగత నాలు వరుసగా జరుగుతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా బస్సులు ఎక్కే సమయంలో లేదా రద్దీ ప్రాంతాల్లో దుండగులు ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో ఉప్పల్ రింగ్ రోడ్డుపై భద్రతా చర్యలు పెంచాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు ఈ ప్రాంతంలో గస్తీని దొంగల బెడదను అరికట్టాలని, ప్రజలు భయాం దోళనలు లేకుండా ప్రయాణించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం



**దుద్యాల, (జనంసాక్షి):** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 9వ తరగతి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహిం చారు.అనంతరం నిర్వహించిన సమావేశాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రధానో పాధ్యాయుడు మల్లప్ప మాట్లాడుతూ విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని, ఉత్తీర్ణత పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రవీందర్ గౌడ్, రాములు, సుధాకర్ రావు, ముకుందా రెడ్డి,రమేష్,రవి నాయక్,చంద్రశేఖర్ రెడ్డి, మాధవి, నవీన,శ్రీనివాస్,సాలిబాయి, పాల్గొన్నారు.

### రావులపల్లి గ్రామంలో

## సర్పంచ్ శ్రమదాన కార్యక్రమం




**చేవెళ్ల, మార్చి 10 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ గోటూరి రామచంద్రయ్య గౌడ్ ఆధ్వర్యంలో రావులపల్లి గ్రామంలో శ్రమదాన కార్యక్రమం నిర్వహించి గ్రామంలో అన్ని రోడ్లను శుభ్రం చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనూష అంజన్ కుమార్ గారు, పంచాయతీ కార్యదర్శి లింగంగారు, వార్డు సభ్యులు కుమ్మరి గోపాల్ , కౌకుంట్ల జ్యోతి వెంకటేష్ , గోటూరి మల్లేశ్వరి హనుమంత ,పిఎసిఎస్ డైరెక్టర్ కేసారం నరేందర్ , మాజీ ఉపసర్పంచ్ పట్లోళ్ల నాగిరెడ్డి , మాజీ వార్డు సభ్యులు కావలి సత్యనారాయణ , బుడ్డనోళ్ల కుమార్, గజ్జల యాదయ్య , గ్రామ పెద్దలు, యువకులు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

### మహిళా దినోత్సవం సందర్భంగా

## మహిళా ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం



**చేవెళ్ల, (జనంసాక్షి):** ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా చేవెళ్ల మండల ంలోని గుండాల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ బండారి శైలజఆగి రెడ్డి, కౌన్సిలర్ ఎం.కళ్యాణి యాదగిరి, గుండాల గ్రామ ప్రథమ పౌరుడి సతీమణి మాలతి రెడ్డి, వార్డ్ సభ్యురాలు ఈశ్వరి భాయి, అంగన్‌వాడీ టీచర్లు స్వప్న, శివలీల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు రెబేకా, జడ్పీహెచ్ఎస్ మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అలాగే సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రప టానికి నివాళులర్పించి, మహిళా విద్య కోసం చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వ హించి, చదువు జీవితంలో ఎంతో ముఖ్యమని, కష్టపడి చదివి ఉన్నత స్థానా లకు చేరాలని నాయకులు, ఉపాధ్యాయులు సూచించారు. పదో తరగతిలో మం చి ఫలితాలు సాధించిన విద్యార్థులకు రూ.5,000/- బహుమతి అం దజేస్తానని చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి ప్రకటిం చారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు శివానందం, జి.శ్రీని వాస్, ఎస్ఎంసీ చైర్మన్ యాదగిరి, జూనియర్ అసిస్టెంట్ సాయి చైతన్య పాల్గొన్నారు.

# విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఇవ్వాలి

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేష్**

**చేవెళ్ల, (జనంసాక్షి):** విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లు, పేద విద్యార్థులకు విద్య హక్కు చట్టని పకడ్బందీగా అమలు చేయాలని పిడిఎస్‌యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేష్ తెలిపారు. 2009 విద్యాహక్కు చట్టం ఆర్టికల్ 21-ఏ ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వెనుకబడిన వర్గాలకు 25 శాతం ఉచిత సీట్లు ఇవ్వాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో చేవెళ్ల ఆర్డీవో పార్థసింహా రెడ్డి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేష్




మాట్లాడుతూ.. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం భారతదేశంలో 6 నుండి 14 సంవత్సరాల వయసు గల పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యను తప్పనిసరిగా చట్టం చేస్తూ ఆర్టికల్ 21 ఏ ప్రకారం విద్య ఒక ప్రాథమిక హక్కు దీని ప్రకారం ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాల పేద పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలలో 25% ఉచితంగా సీట్లు ఇవ్వాలని చట్టంలో ఉన్నప్పటికీ దీనిని ఎక్కడ అమలు పరచడం లేదన్నారు. ఉన్నత అధికారులు చర్చించి వచ్చే విద్య అకాడమిక్ 2026-2027లో విద్యార్థులు పాఠశాలల్లో అడ్మిషన్స్ తీసుకునే ముందు చట్ట ప్రకారం అమలు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రంగారెడ్డి జిల్లా కమిటీ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. అదేవిధంగా ఎంతోమంది తల్లిదండ్రులు లేని విద్యార్థులు ఆర్థిక పరిస్థితులను ఎదుర్కోలేని ప్రజల పిల్లలకు, కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలలో 25 శాతం సీట్లు కచ్చితంగా పేద విద్యార్థులకు ఉచితంగా ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి బొజ్జి శ్రీకాంత్, సహాయ కార్యదర్శి న్యాలట అశోక్, సునీల్ ఉన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**మున్సిపల్ చైర్మన్ దేవర సమతవెంకట్ రెడ్డి**



**చేవెళ్ల, మార్చి 10 (జనంసాక్షి):** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ దేవర సమతవెంకట్ రెడ్డి అన్నారు. ప్రజా పాలన-ప్రగతి కార్యాచరణ ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు కౌన్సిలర్ కురువ మంగమ్మ మల్లేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశం, వైస్ చైర్మన్ కాసుల రాముగౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజాఆగిరెడ్డి, నాయకులు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వీధులల్లో ఎక్కడబడితే అక్కడ చెత్త వేయకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. 99 ప్రజా పాలనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, ఎర్ర మల్లేష్, నాయకులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

**మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్**



**కొడంగల్ ,(జనంసాక్షి):** పశు పోషకులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని కొడంగల్ మున్సిపాలిటీ చైర్మన్ నందారం ప్రశాంత్ అన్నారు.మంగళ వారం మున్సి పాలిటీ పరిధిలో గుండ్లకుంటలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై రెబ్బెన కట్ చేసి ప్రారంభించారు.ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల్లో గాలికుంటు వ్యాధి సోకితే పాల ఉత్పత్తి తగ్గుతుందన్నారు.ఈ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం 10/03/2026 నుండి 10/04/26 వరకు ప్రతి గ్రామములో జరుగుతుంది కావున అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ ను డాక్టర్ ఏడి నోహ శాలువా పూలదండతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏడి నోహ, డాక్టర్ పరమేష్ విఏఎస్, వెంకటయ్య జెవిఓ, ఎల్ఎస్ ఏ శేఖర్,రాకేష్ జిఎం, శివాజీ జిఎం, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకలు

**షాబాద్ మాజీ జెడ్పిటిసి సభ్యులు పట్నం అవినాష్ రెడ్డి**



**షాబాద్, (జనంసాక్షి) :** ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని షాబాద్ మాజీ జడ్పిటిసి సభ్యులు పట్నం అవినాష్ రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి షాబాద్ మండల కేంద్రంలోని వారి నివాసంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ బిందు, భోజనం ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అనంతరం వారికి పండ్లు తినిపించి ఉపవాస దీక్షలు వరమింప చేశారు. ఈ సందర్భంగా అవినాష్ రెడ్డి మాట్లాడుతూ... కుల మతాలకతీతంగా ప్రజలందరూ కలసి మెలసి ఉండా లని సూచించారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలు చేపట్టడం గొప్ప పరిమాణం అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు ఎంఏ మథిన్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు గూడూరు నర్సింగరావు, చల్లా శ్రీరామ్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు జడల రాజేందర్ గౌడ్, నక్క శ్రీనివాస్ గౌడ్, కల్వకోల్ వెంకట్ యాదవ్, పొన్న నరసింహారెడ్డి, చల్లా శేఖర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మైనార్టీ సెల్ నాయకులు ఇమ్రాన్, హరీఫ్, ముక్రం ఖాన్, పాల్గొన్నారు.

## బండ్లగూడ జాగీర్ కాలనీల్లో సమస్యల పై తక్షణ చర్యలు తీసుకోవాలి



**రాజేంద్రనగర్, (జనంసాక్షి):** జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో టిఆ ర్ఎస్ అధ్యక్షుడు రావులకొళ్ల నాగరాజ్ మంగళవారం బండ్లగూడ జాగీర్‌లోని హిమగిరి నగర్, సాయిరాం నగర్, మాధవ్ నగర్ కాలనీలను సందర్శించి స్థానికులతో కలిసి సమస్యలను పరిశీలించారు. కాలనీలలో రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని తెలిపారు. మధ్యలో వదిలేసిన డ్రైనేజీ పనుల వల్ల నీరు ఉప్పొంగి కాలనీ వాసులకు సమస్యలు ఏర్పడుతున్నాయని చెప్పారు. అలాగే ఐదు నెలల క్రితం రోడ్లను తవ్వి అలాగే వదిలేయడంతో ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యలను పరిష్కరించి నూతన రోడ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఉప్పల్ భగాయత్‌కు నిధుల వరద - రూ.13 కోట్ల అభివృద్ధి నిధులు

**- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కృషితో హెచ్ఎండిఏ ఆమోదం**

**- కమ్యూనిటీ హాల్, 10 కి.మీ బ్లాక్‌టాప్ రోడ్లు, పారిశుద్ధ్య సిబ్బంది కేటాయింపు**

**ఉప్పల్, (జనంసాక్షి):** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఉప్పల్ భగాయత్ ప్రాంత అభివృద్ధికి కీలక ముందడుగు పడింది. ప్రాంత ప్రజలు సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించేందుకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేసిన నిరంతర కృషి ఫలితంగా హెచ్ఎండిఏ అధికారులు రూ.13 కోట్ల అభివృద్ధి నిధులను మంజూరు చేశారు. ఈ నిధులతో కాలనీలో రహదారులు, కమ్యూనిటీ హాల్, పారిశుద్ధ్య సదుపాయాలు, పార్కుల అభివృద్ధి వంటి పలు కీలక పనులు చేపట్టనున్నారు.

**ఆధునిక కమ్యూనిటీ హాల్ నిర్మాణం**

మంజూరైన నిధుల్లో భాగంగా రూ.3 కోట్లు 40 లక్షల వ్యయంతో ఆధునిక సదుపాయాలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తయిన తర్వాత కాలనీలో నివసించే ప్రజలు వివాహాలు, సామాజిక కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహిం చుకునేందుకు సౌకర్యం కలుగనుంది. దీని ద్వారా స్థానికులకు సమీపంలోనే ఒక శాశ్వత వేదిక అందుబాటులోకి రానుంది.

**రహదారి సౌకర్యాల మెరుగుదల**

అదేవిధంగా రూ.9 కోట్లు 60 లక్షల వ్యయంతో సుమా రు.10 కిలోమీటర్ల మేర బ్లాక్‌టాప్ రోడ్ల ని ర్మాణ పనులు చేపట్టనున్నారు. ప్రస్తుతం కొంత మంది నివాసితులు రహదారుల దుస్థితి కారణం గా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ ప నులు పూర్తయితేనీలో రాకపోకలు మరింత సుల భతరం అవుతాయని అధికారులు పేర్కొన్నారు.



**పారిశుద్ధ్యానికి ప్రత్యేక చర్యలు**

హెచ్ఎండిఏ లేఔట్ పరిధిలోని రోడ్లపై చెత్త పేరుకుపోయి నివాసితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల విజ్ఞప్తి మేరకు 42 మంది పారిశుద్ధ్య కార్మికులను ప్రత్యేకంగా కేటాయించారు. దీంతో కాలనీలో పరిశుభ్రత మెరుగుపడి ఆరోగ్యకర వాతావరణం నెలకొనే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు.

**పార్కు అభివృద్ధికి ప్రతిపాదనలు**

లేఔట్‌లో ఉన్న సుమారు 8 ఎకరాల పార్కు స్థలాన్ని అభివృద్ధి చేయాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పార్కు చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయడం, పెద్దలు మరియు పిల్లల కు అవసరమైన సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ అంశాలను పరిశీలించి త్వరి తగతిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

**రైతు బజార్ అభివృద్ధి**

అదేవిధంగా లేఔట్‌లో రైతు బజార్ కోసం కేటాయించిన స్థలాన్ని అభివృద్ధి చేసి కూరగాయల వ్యాపారం సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ సభ్యులు కోరారు. రైతు బజార్ ఏర్పాటుతో స్థానిక ప్రజలకు తక్కువ ధరలకు తాజా కూరగాయలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

**ఇతర సమస్యల పరిష్కారానికి హామీ**

వెస్ట్ సైడ్ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థ, మంచినీటి సరఫరా వంటి పలు సమస్యలను కూడా ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులతో చర్చించి వీటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ప్రాంత అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## బాలికలు చదువులో ముందుండి అన్ని రంగాల్లో రాణించాలి

**ఎస్బీఐ ఆధ్వర్యంలో బాలికలకు సైకిళ్ల పంపిణీ**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** బాలికలు చదువులో ముందుండి అన్ని రంగాల్లో రాణించాలని, వారికి అవసరమైన సహాయ సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బాలికలకు ఉచితంగా 100 సైకిళ్లు అందించే కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బాలికలకు సైకిళ్లు అందజేశారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ వందశాతం హాజరు ఉన్న బాలికలను ఎంపిక చేసి సైకిళ్లను మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా తొలి విడతగా 21 మంది విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, ఎస్బీఐ రీజినల్ మేనేజర్, జిల్లా విద్యాశాఖ అధికారి విజయ కుమారి, విద్యార్థినులు , తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## డేర్ టు డ్రీమ్' కార్యక్రమం నిర్వహించిన షీ అండ్ వీ వుమెన్, అమెజాన్

**ఖైరతాబాద్, (జనంసాక్షి) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల ఆధ్వర్యంలోని వ్యాపారాలు, సామాజిక కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు షీ అండ్ వీ-వుమెన్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ ఫౌండేషన్, అమెజాన్ ఇండియా కలిసి 'డేర్ టు డ్రీమ్' పేరిట కార్యక్రమం నిర్వహించినట్లు షీ అండ్ వీ వ్యవస్థాపకురాలు డైరెక్టర్ డా.కృతి పటేల్ మంగళవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమెజాన్ ఇండియాలో ఏఎంజెడ్ఎల్ ఇండియా ఆపరేషన్స్ డైరెక్టర్ సలీం రఫిక్ మెమన్ తో కలిసి ఆమె మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు భారతదేశంలోని 'వికసిత భారత్ 2047' దిశలో అమెజాన్ కార్యక్రమాలు ముందుకు సాగుతున్నా యని తెలిపారు. మహిళలు ధైర్యంగా కలలు కంటే స్థిరమైన




జీవనోపాధి మార్గాలు ఎలా ఏర్పరుచుకో వచ్చో ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణ మహిళలు తమ అనుభవాలతో వివరించినట్లు తెలిపారు. ఈ వేడుకకు మహిళా పారిశ్రామికవేత్తలు, సమాజ నాయకులు, ప్రభుత్వ ప్రతినిధులు, స్థానిక ప్రజలు హాజరైనట్లు చెప్పారు.

## ఐడిఎఫ్ సి విధానానికి హర్యానా ప్రభుత్వ శాఖ కృతజ్ఞతలు

ఖైరతాబాద్, మార్చి 10 (జనంసాక్షి) : నకిలీ పత్రాలు, చెల్లింపు సూచనలను క్లియర్ చేయడం లో బ్రాంచ్‌లోని కొంతమంది ఉద్యోగులు మోసపూ రితంగా వ్యవహరించారని ఐడిఎఫ్ సి ఫస్ట్ బ్యాంక్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించింది.

ఈ అంశం ప్రస్తుతం సంబంధిత అధికారుల దర్యాప్తు లో ఉందని ఆ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. దర్యాప్తు కొనసాగుతున్న ప్పటికీ, హర్యానా ప్రభు త్వ సంబంధిత విభాగాలు క్లెయిమ్ చేసిన రూ. 583 కోట్ల విలువైన అసలు, వడ్డీని బ్యాంక్ వెంటనే 100 శాతం చెల్లించిందన్నారు. ఏవైనా తదుపరి క్లెయిమ్‌లు లేదా సవరణలను బట్టి తుది మొత్తం మారవచ్చని తెలిపారు. ఈ అంశాన్ని పరిష్కరించ డంలో బ్యాంక్ యొక్క సూత్రప్రాయమైన విధానం, సత్వర చర్య, వృత్తిపరమైన ప్రవర్తనకు హర్యానా ప్రభుత్వంలోని సంబంధిత విభాగాలు కృతజ్ఞతలు తెలిపాయన్నారు.

చండీగఢ్‌లోని తమ శాఖలలో ఒకదానిలో హర్యానా ప్రభుత్వ విభాగాలకు చెం దిన కొన్ని ఖాతాలకు సంబంధించిన సంఘటనల కు సంబంధించి ఇటీవల వెల్లడించిన విషయాలను వివరించారు. హర్యానా ప్రభుత్వం, చట్ట అమలు సంస్థల పూర్తి మద్దతుతో ఐడిఎఫ్ సి ఫస్ట్ బ్యాంక్ మోసానికి పాల్పడినవారిపై పోరాడి వారిని న్యా య స్థానాల ముందు నిలబెట్టడానికి దృఢంగా నిశ్చయించుకుందని తెలిపారు.

## రాసుమల్లగూడ పాఠశాలలో ఘనంగా సావిత్రి బాయి పూలే వర్ధంతి

**ఫరూఖ్ నగర్ (జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండల్ రాసుమల్లగూడ ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సిములు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ నత్తి శివరాములు, ఉప సర్పంచ్ మెరుగు మహేందర్,గ్రామా కార్యదర్శి అనూష ఉపాధ్యాయురాలు కవిత,మాజీ సర్పంచ్ దొడ్డి రంగయ్య , వార్డు సభ్యులు నరేందర్, భరత్ కుమార్, మంగమ్మ యువజన నాయకులు దొడ్డి శ్రీను, దొడ్డి మహేందర్, చాత్రోపాధ్యాయిని నేహా,విద్యార్థుల తల్లిదండ్రులు అనుషాయ,స్వప్న,రాధిక, లక్ష్మమ్మ, కొమరమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సిములు మాట్లాడుతూ ఆనాటి మరాఠా సమాజంలో అనేక వివక్షతలు, అసమానతలుతో దోపిడి, పీడన అణిచివేత ఉన్న సందర్భంలో పూలే దంపతులు ఇవన్నీ నిర్మూలించాలంటే ముందుగా ప్రజలు చైతన్యం కావాలని అందుకోసం విద్య ప్రధాన ఆయుధమని అందుకోసం 52 కు పైగా పాఠశాలలను



స్థాపించి తన భార్య సావిత్రిబాయి పూలేకు చదువు నేర్పి ఉపాధ్యాయురాలుగా చేసి ముఖ్యంగా వారు బాలిక విద్య కై పాటుబడినారు. అంతేకాకుండా సత్యశోధక సమాజాన్ని ఏర్పాటుచేసి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన్దని నేటికీని ఆ సత్యశోధక సమాజా కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని తెలియజేశారు. పూలే దంపతుల ఆశయాలు ఉన్నతమైనవని వారి ఆశయాలను కొనసాగించడమే మనం వారికిచ్చే ఘనమైన నివాళులని తెలియజేయడం జరిగింది.

## యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌లో విజయంతో నియోజకవర్గ ఇన్చార్జి అభినందనలు

రాజేంద్రనగర్, (జనంసాక్షి): యూపీఎస్సీ ప్రతిష్టాత్మక సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో మా టౌన్‌షిప్‌కు చెందిన వెలిమినేటి విక్రమ్ సింహారెడ్డి, వెలిమినేటి విజయ్ రెడ్డి ఉత్తీర్ణత సాధించడం గర్వకారణమని



నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కస్తూరి నరేందర్ ముదిరాజ్ పేర్కొన్నారు. వారి కృషి, పట్టుదల, నిరంతర శ్రమతో ఈ గొప్ప విజయాన్ని సాధించడం అభినందనీయమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఇద్దరు సోదరులను ప్రత్యేకంగా అభినందిస్తూ, భవిష్యత్తులో ఉన్నత పదవుల్లో చేరి ప్రజలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మెరుగు జితేందర్, లక్ష్మీనారాయణ, పురుషోత్తం కిరణ్ కుమార్ తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ అబాకస్ పోటీల్లో శ్రీ చైతన్య విద్యార్థిని మోక్షిత ప్రభంజనం

**బోడుప్పల్ (జనంసాక్షి):** గణిత శాస్త్రంలో తన అసాధారణ ప్రతిభను చాటుతూ, శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన రెండో తరగతి విద్యార్థిని యు. మోక్షిత 2026 జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో విజేతగా నిలిచింది. దేశవ్యాప్తంగా వేలాది మంది ప్రతిభావంతులైన




విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలో మోక్షిత అత్యంత వేగంతో మరియు ఖచ్చితత్వంతో క్లిష్టమైన లెక్కలను క్షణాల్లో పరిష్కరించి అందరినీ ఆశ్చర్యపరిచింది. చిన్న వయసులోనే ఆమె సాధించిన ఈ విజయం శ్రీ చైతన్య పాఠశాల అందిస్తున్న నాణ్యమైన శిక్షణకు క్రమశిక్షణతో కూడిన విద్యా విధానానికి నిదర్శనంగా నిలిచింది. జాతీయ స్థాయిలో పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తెచ్చిన మోక్షితను పాఠశాల యాజమాన్యం ఘనంగా అభినందించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సి పాల్ సామ అశోక్ రెడ్డి మాట్లాడుతూ ఈ విజయం విద్యార్థిని యొక్క కఠోర శ్రమకు ఉపాధ్యాయుల నిరంతర ప్రోత్సాహానికి దక్కిన ఫలితమని తెలిపారు. కేవలం రెండో తరగతిలోనే జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ సామ శోభా రాణి, డైరెక్టర్ సామ సాయి అభిషేక్ రెడ్డిలు మోక్షితను ప్రత్యేకంగా అభినందించి ఆమె అద్భుత ప్రతిభను ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పిల్లల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి మరియు గణిత నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రతిఏటా ఈ జాతీయ స్థాయి అబాకస్ పోటీలను నిర్వహిస్తారని తెలిపారు. 2026 విద్యా సంవత్సరంలో యు. మోక్షిత సాధించిన ఈ ప్రథమ స్థానం పాఠశాల చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి

### మండల ఉపాధ్యక్షుడు బేగరి శివరాజ్

**నవాబుపేట్ మార్చి 10( జనంసాక్షి):** నవాబుపేట్ మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో అంబేద్కర్ విగ్రహం వద్ద సావిత్రిబాయి పూలే 129వ. వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం దళితరత్న గ్రహీత అవార్డు బేగరి శివరాజ్, ఆధ్వర్యంలో అంబేద్కర్ యువజన సంఘం కోశాధికారి (నింగిజాన్). ఆధ్వర్యంలో ఘనంగా సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాల సమర్పించారు. ఈ కార్యక్రమాన్ని మండల యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల అంబేద్కర్ యువజన సంఘాల వారు మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే (1831–1897) భారతదేశపు మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, గా గొప్ప సంఘ సంస్కర్త కవయిత్రి. ఆమె తన భర్త జ్యోతిరావ్ పూలేతో కలిసి 1848లో పూణేలో బాలికల కోసం మొదటి పాఠశాలను స్థాపించారు. స్త్రీ విద్య, దళితుల హక్కులు కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడి, వితంతువుల కోసం ఆశ్రమాలు, సత్య శోధక్ సమాజ్‌ను ఏర్పాటు సామాజిక మార్పుకు కృషి చేశారు.

**సావిత్రిబాయి పూలే జీవిత చరిత్ర:**

**జననం బాల్యం:** సావిత్రిబాయి 1831 జనవరి 3న మహారాష్ట్రలోని సతారా జిల్లా, నైగావ్ గ్రామం లో ఒక రైతు కుటుంబంలో జన్మించారు. వివాహం విద్య: 9 సంవత్సరాల వయసులో జ్యోతిరావ్ పూలేతో వివాహం జరిగింది. ఆ కాలంలో మహిళలకు చదువు లేకపోయినా, జ్యోతిరావ్ ప్రోత్సాహంతో ఆమె అక్షరాస్యురాలై, ఉపాధ్యాయ శిక్షణ పొందారు.



**స్త్రీ విద్యా వ్యాప్తి:** 1848లో పూణేలోని భిడే వాడలో బాలికల కోసం మొదటి పాఠశాలను స్థాపించారు. ఛాందసవాదుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైనా, పాఠశాలకు వెళ్లే దారిలో పేడ, రాళ్లతో దాడి చేసినా వెనకడుగు వేయకుండా విద్యా బోధన చేశారు.

**సామాజిక సంస్కరణలు:** 1873లో 'సత్యశోధక్ సమాజ్' ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించారు, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడారు వితంతువుల కోసం ప్రత్యేక గృహాన్ని (బాలహత్యా ప్రతిబంధక గృహం) ఏర్పాటు చేశారు.

**రచనలు:** ఆమె 'కావ్య పూలే', 'బావన్ కషి సుబోధ రత్నాకర్' వంటి పుస్తకాల ద్వారా సమాజంలో చైతన్యం తీసుకురా వడానికి కవిత్వం రాశారు.

**మరణం:** ప్లేగు వ్యాధి గ్రస్తులకు సేవ చేస్తుండగా, ఆ వ్యాధి సోకి 1897 మార్చి 10న మరణించారు.

భారతదేశం లో స్త్రీల సాధికారతకు విద్యకు ఆమె పునాదులు వేశారు, అందుకే ఆమెను భారతీయ మహిళా విద్యకు మాతృమూర్తిగా భావిస్తారనీ వారు పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో గేట్ వనంపల్లి మాజీ సర్పంచి రత్నం, మాదిరెడ్డిపల్లి మాజీ ఉప సర్పంచ్ బేగా రీ శ్యామ్ రావు, ఎక్మామిడి మాజీ సర్పంచ్ దేవయ్య, చిట్టి గిద్ద స్థానిక సర్పంచ్ పోతురాజు శ్రీధర్ రావు, ఎక్ మామిడి ఈశ్వర్, ముబారక్పూర్ దశరథ్,మాదిరెడ్డిపల్లి రవి, చిట్టిగిద్దా సుధాకర్, బక్కని నర్సింలు, మీనెపల్లి కావలి అంజయ్య, మాదిరెడ్డిపల్లి బద్రి, గణపురం శ్రీనివాస్, నింగి శ్రీనివాస్, మాదిరెడ్డిపల్లి శాంతికుమార్, బషీర్, మండల రిపోర్టర్లు, లక్ష్మణ్, పాండు, పాండు రంగం, ఫీల్డ్ అసిస్టెంట్లు, వెంకటేష్, శ్రీనివాస్, మండలం పరిధిలోని వివిధ గ్రామాల అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా బుయ్యని శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు









- సోదర భావం చాటుకున్న బుయ్యని సోదరులు
- బుయ్యని త్రిమూర్తుల కలయికతో వెల్లివేసిన ఆనందం
- జనహృదయ నేతకు జన్మదిన శుభాకాంక్షలు
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి
- జన్మదిన వేడుకలు మరేన్నో జరుపుకోవాలి
- మున్సిపల్ చైర్పర్సన్ నీరజబాల్ రెడ్డి

**తాండూరు (జనంసాక్షి):** ప్రతినిత్యం ఏదో పనిలో బిజీగా ఉంటూ ఎవరి పని వారు చేసుకుంటూ వెళుతన్న నేటి సమాజంలో బుయ్యని సోదరులు సోదర భావం చాటుకున్నారు.ఎమ్మెల్యే సోదరుడు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం శ్రీనివాస్ రెడ్డి నివాసంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే స్వాయంగాతన సోదరుడు ఆర్బీఓఎల్ సీఈవో శ్రీనివాస్ రెడ్డి చేతులమీదుగా కేక్ కట్ చేయించి సోదర బావం చాటుకున్నారు. అదేవిధంగా మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి దంపతులు శ్రీనివాస్ రెడ్డికి గజ మాలతో ఘనంగా సన్మానించి జన హృదయ నేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మనసారా ఆకాంక్షించారు. ఒకే వేదికపై బుయ్యని(త్రిమూర్తులు) సోదరులు కలయికతో నాయకుల్లో ఆనందం ఉట్టి పడింది. అదేవిధంగా పట్టణ ప్రజా ప్రతినిధులు యువ నాయకులు తదితరులు కలిసి బుయ్యని శ్రీనివాస్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ భవిష్యత్తులో ఉత్తమ పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

**యాలాల (జనంసాక్షి):** ఆర్బీఓఎల్ అధినేత బుయ్యని శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం యాలాల మండలం జక్కేపల్లి గ్రామ సమీపంలోని ఆర్బిఓఎల్ ఫ్యాక్టరీలో ఫ్యాక్టరీ ఉద్యోగుల సమక్షంలోఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. తమ అధినేత బుయ్యని శ్రీనివాస్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, మరెన్నో ఉత్తమ పదవులు అధిరోహించాలని మనసారా ఆకాంక్షించారు.

## ఘనంగా రాష్ట్ర యువజన నాయకులు రాగం అనిరుధ్ యాదవ్ జన్మదిన వేడుకలు



**శేరిలింగంపల్లి (జనంసాక్షి) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్ర మాజీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్పర్సన్ రాగం సుజాత యాదవ్, శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తనయుడు రాష్ట్ర యువజన నాయకులు రాగం అనిరుధ్ యాదవ్ జన్మదిన శుభసందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం నల్లగండ్లలోని వర్టెక్స్ కింగస్టన్ పార్క్ విల్లాస్ లోని ఆయన నివాసంలో అంగరంగ వైభవంగా నిర్వహించి, జన్మదిన వేడుకలలో భాగంగా భారీ ఎత్తున ఏర్పాటుచేసిన కేక్ కటింగ్ లో శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, యువ నాయకులు, బూత్ కమిటీ సభ్యులు, కాలనీ అసోసియేషన్ అనుబంధ సభ్యులు, అభిమానులు భారీ సంఖ్యలో విచ్చేసి యువజన నాయకులు రాగం అనిరుధ్ యాదవ్ ను గజమాలలతో, శాలువాలతో సత్కరించారు. వందల సంఖ్యలో తరలివచ్చినవారు రాగం అనిరుద్ యాదవ్ కు పూల బొకేలను బహుకరించి ఆత్మీయతతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని ఆశీర్వదించడం జరిగింది. పరిసర ప్రాంతాల నుండి భారీగా తరలివచ్చిన రాజకీయ నాయకులు, వివిధ సంస్థల ప్రతినిధులు, యువజనులు అనిరుద్ యాదవ్ కు జన్మదిన శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి ప్రజలు మాట్లాడుతూ.. ప్రజాసేవే లక్ష్యంగా తండ్రికి తగ్గ తనయుడిగా అభివృద్ధి మార్గంలో తమను నడిపిస్తున్న ఆశయాల యువనేతకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఒక మంచి లక్ష్యంతో ముందుకు సాగుతూ సేవే పరమావధిగా ఎలాంటి పబ్లిసిటీ లేకుండా నిరాడంబరంగా ముందుకు సాగుతున్న రాగం అనిరుద్ జీవితంలో అత్యున్నత స్థానానికి చేరుకోవాలని, రాజకీయంలో ఉన్నత స్థానంలో నిలబడి ప్రజాసేవ కొనసాగించాల్సిన అవసరం ఉందని వారు ఆశ భావం వ్యక్తం చేశారు. రాగం అనిరుధ్ యాదవ్ ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్లు నవ్వుతూ ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆ భగవంతుని ఆశీస్సులు ఆయనకు ఎల్లవేళలా ఉండాలని మనసారా కోరుకుంటున్నట్లు పలువురు అభిప్రాయపడ్డారు. అనంతరం రాగం అనిరుధ్ ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనం స్వీకరించి జన్మదిన వేడుకలను జయప్రదం చేశారు.

## ఉరెల్ల పాఠశాలకు కంప్యూటర్లు, క్రీడా సామగ్రి పంపిణీ




**చేవెళ్ల, మార్చి 10 (జనంసాక్షి):** చేవెళ్ల రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీ హిల్స్ సభ్యులు ఉరెళ్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కంప్యూటర్లు, ప్రొజెక్టర్, ఫర్నిచర్, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు, క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీ హిల్స్ అధ్యక్షుడు కళ్యాణ్ పంగులూరి, కార్యదర్శి లక్ష్మి వాసిరెడ్డి, సభ్యులు బాలకోటి, చక్రవర్తి పాల్గొని పాఠశాలకు అవసరమైన సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.యాదగిరి, సిబ్బంది కె.శేఖర్, ఎస్.వెంకటేశం, పి.ప్రవీణ్, పి.సునీతతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుందని పాఠశాల ఉపాధ్యాయులు రోటరీ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యుత్ కార్మికుల సమస్యలను విస్మరిస్తున్న ప్రభుత్వం



**శామీర్ పేట, (జనంసాక్షి):** విద్యుత్ కార్మికులు మహాధర్నా కు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. మంగళవారం విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరిం చాలంటూ శామీర్‌పేట విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని అలియాబాద్ సెక్షన్, శామీర్ పేట సెక్షన్లలోని విద్యుత్ కార్మికులు శామీర్ పేట కట్ట మైసమ్మ ఆలయం వద్ద పూజల నిర్వహించి తరలి వెళ్లారు. విద్యుత్ యాజ మాన్యం సమస్యలను పరిష్కరించే వరకు ఈ పోరాటము ఆపేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్‌లోని విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు.

## ముద్దం నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**సికింద్రాబాద్(జనంసాక్షి):** బోయిన్ పల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళా నాయకురాళ్లు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి, సంబురాలు జరుపుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముద్దం నరసింహ యాదవ్ మాట్లాడుతూ.. మహిళలు కుటుంబ భారాన్ని మోస్తూ ఉద్యోగాలతో పాటు ఇతర రంగాలలో రాణిస్తూ ముందుకు సాగుతూన్నారని కొనియాడారు. ప్రతి ఒక్క మహిళా స్వశక్తితో ఎదిగి, ఆర్థికంగా, రాజకీయంగా బలపడాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ డివిజన్ సెక్రటరీ హరినాథ్, మహిళా అధ్యక్షురాలు లలిత గౌడ్, గడ్డం నర్సింగ్ రావు, బీసీ సెల్ అధ్యక్షులు మట్టి శ్రీనివాస్, దుర్గా, ఉమారాణి, అనురాధ, స్వరూప గౌడ్, ఉదయ్ రాణి, సరోజ, శాలిని, రోజా, సంతోషి, హఫీజ్, కార్టూన్, కమల, పద్మలత, వరలక్ష్మి,సుమలత, కవిత, దేవి, శ్రీలక్ష్మి, పుష్ప, రాజకుమారి, దేవాబాయి, కొండమ్మ, పద్మ ,స్వరూప ,అర్చన,మరియమ్మ, పాల్గొన్నారు.

## రంగారెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ బరిలో పెల్లి సత్తిరెడ్డి ?

### బిఆర్ఎస్ టిఆర్ఎస్ నుండి టికెట్ ఆశిస్తున్న .. సత్తిరెడ్డి



**కుత్బుల్లాపూర్ (జనంసాక్షి):** సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలు సమీపి స్తున్న సమయంలో కార్పొరేటర్ టికెట్టు ఆశావాహులు ఎవరి ప్రయత్నాలు వారు కొనసాగిస్తున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డి నగర్ డివిజన్ నుండి టిఆర్ఎస్ పార్టీ తరఫున పెల్లి సత్తిరెడ్డి బరిలో దిగడానికి వ్యూహం చేసుకుంటున్నట్లుగా సమాచారం. తెలంగాణ ఉద్యమం నాటి నుండి టిఆర్ఎస్ పార్టీలోనే ఉంటూ నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులతో, డివిజన్ ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండడం ఆయనకు అనుకూల అంశంగా భావిస్తున్నారు. డివిజన్ ప్రజలలో స్నేహశీలి గా, సౌమ్యునిగా మంచి గుర్తింపును తెచ్చుకున్న సత్తిరెడ్డి పార్టీ టికెట్టు కేటాయిస్తే గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయని స్థానికులు అభిప్రా యపడుతున్నారు. టిఆర్ఎస్ పార్టీలో బడా నాయకుల ఆశీస్సులు ఉండడం వలన టికెట్ కేటాయింపు ఆయనకు సులువు గానే దక్కించుకునే పరిస్థితి ఉన్నట్లుగా ప్రాథమిక సమాచారం. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన తాను మాత్రం రంగారెడ్డి డివిజన్ నుండి టీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలోకి దిగడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్‌గా పాలకూర్ల ఐలేష్ గౌడ్



**ఇబ్రహీంపట్నం, మార్చి 10 (జనంసాక్షి):** తెలంగాణ స్టేట్ రాజీవ్ గాంధీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా కన్వీనర్‌గా ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రానికి చెందిన పాలకూర్ల ఐలేష్ గౌడ్‌ను నియమించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు ఎరగాని నాగన్న గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఐలేష్ గౌడ్ రంగారెడ్డి జిల్లా పరిధిలో భవన నిర్మాణ కార్మికులు మరియు అసంఘటిత కార్మికులను సంఘటితం చేసి, యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని అధ్యక్షులు నాగన్న గౌడ్ సూచించారు. ఈ సందర్భంగా ఐలేష్ గౌడ్ మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న అన్నారు. కాంగ్రెస్ పార్టీ, పార్టీ అనుబంధ సంఘాల పిలుపుమేరకు నడుచుకుంటానని చెప్పరు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు పదవికి సహకరించిన యూనియన్ గౌరవ అధ్యక్షులు సంజీవరెడ్డి, అధ్యక్షులు నాగన్న గౌడ్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గుర్నాథ్ రెడ్డి, కాంగ్రెస్ యువ నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కౌన్సిలర్ లు నీళ్ల బానుబాబు, దారు రాఘవేందర్ రావు, కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ గౌస్, లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జీ వెంకన్న, కె లాలియా, ప్రభాకర్, ఏ రాము, అంజయ్య, శ్రీనివాస్, మహేష్ గౌడ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## నాల్గవ వార్డులో ఇళ్ళలోకి చేరుతున్న మురుగునీరు



**యాచారం, (జనంసాక్షి):** యాచారం గ్రామ పంచాయతీ పరిధిలోని నాలుగో వార్డు ఎల్లమ్మ గుడి కాలనీలో డ్రైనేజీ సమస్య నరకం చూపుతోంది. గతంలో కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేయడంతో మురుగునీరు సాఫీగా వెళ్లక ఇళ్లలోకి చేరుతోందని వార్డు సభ్యుడు శ్రీనాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు నిలిచిపోవడంతో దోమల బెడద తీవ్రమై రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని కాలనీవాసులు బెంబేలెత్తుతున్నారు. ఫాగింగ్ చేయించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ

**శామీర్ పేట, మార్చి 10 (జనంసాక్షి):** శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ చేపట్టారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళ వారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద శామీర్ పేటకు చెందిన డాక్టర్ సాయి కృష్ణ- కనక దుర్గాదేవి దంపతులు, కుమారుడు పవన్ కృష్ణ, వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టగా శామీర్ పేట సెలబ్రిటీ లోని మంచి కట్ల రాములు- అనురాధ దంపతులు, కుమార్తె అనన్య లు 25 కిలోల బియ్యం అందజేశారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతి నిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.



# స్థానిక ప్రజాప్రతినిధులకు 12న శిక్షణ కార్యక్రమం

**ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికపై పూర్తి అవగాహన కల్పించాలి : సీఎస్ రామకృష్ణరావు**




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 12న సర్పంచులు, మున్సిపల్ వార్డు సభ్యులు, చైర్మన్లు, మేయర్లకు నిర్వహించే శిక్షణా కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు జిల్లా అధికారులను ఆదేశించారు. జూన్ 12 వరకు నిర్వహించే 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా కొత్తగా ఎన్నికైన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు నిర్వహించే శిక్షణా కార్యక్రమంపై మంగళవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, మున్సిపల్ పరిపాలన కార్యదర్శి టి.కె. శ్రీదేవి, సెర్ప్ సీఈఓ దివ్య, ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని రాష్ట్ర ముఖ్యమంత్రి పలుమార్లు పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమాలు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రజాప్రతినిధుల పాత్ర వంటి అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగేలా శిక్షణ ఉండాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12,700 గ్రామపంచాయతీలు, 110 మున్సిపల్ సంస్థలు ఉండగా, వీటిలో దాదాపు 15 వేల మంది ప్రజాప్రతినిధులు ఉన్నారని వివరిం చారు. ఈ శిక్షణ కార్యక్రమ ప్రారంభోత్సవానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను ఆహ్వానించాలని సూచించారు. జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమా లను తెలియజేసే ఫోటో ప్రదర్శనను కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు ఫైళ్ల క్లియరెన్స్, పారిశుధ్య కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు జిల్లా కలెక్టర్లను అభినందించారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మున్సిపల్ చైర్మన్లు, మేయర్లకు ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయాలని కూడా సూచించారు.

## ఆరోగ్య మిత్ర పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఆరోగ్య సేవలను బలోపేతం చేయడానికి ఫీల్డ్ ఆపరేషన్స్‌లో ఖాళీగా ఉన్న ఆరోగ్య మిత్ర పోస్టులను భర్తీ చేయడానికి అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య , ఆరోగ్య అధికారి డాక్టర్ సి. ఉమా గౌరి తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను హైదరాబాద్ లోని సనత్‌నగర్‌లో ఉన్న తెలంగాణ వైద్య విజ్ఞాన సంస్థలో విధులు నిర్వహించేందుకు నియమించనున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ నియా మక ప్రక్రియలో మొత్తం 40 ఆరోగ్య మిత్ర పోస్టులను ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నారు. అభ్యర్థులు డిగ్రీతో పాటు డీసీఏ అర్హత కలిగి ఉండాలి. కనీసం రెండు సంవత్సరాల అనుభవం ఉండాలి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా స్థానిక అభ్యర్థులు మాత్రమే అర్హులు అని పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధికారిక వెబ్‌సైట్ నుండి దరఖాస్తు ఫారమ్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మార్చి 11,12,13,16 తేదీలలో ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారమ్‌తో పాటు విద్యార్హత, అనుభవ సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులు , 500 రూపాయల డిమాండ్ డ్రాఫ్ట్‌ను "డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా" పేరిట జతచేసి అంతాయిపల్లి ఐడీఓసీ లోని జిల్లా వైద్య , ఆరోగ్య అధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. అర్హత గల స్థానిక అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా వైద్య , ఆరోగ్య అధికారి డాక్టర్ సి. ఉమా గౌరి సూచించారు.

## అశోక్ లీలాండ్ ఢీ కొని వ్యక్తి మృతి

**షాబాద్, మార్చి 10 (జనంసాక్షి) :** అతివేగంగా అజాగ్రత్తగా వాహనం నడపటంతో వ్యక్తి మృతికి కారణం అయిన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. షాబాద్ ఇన్స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన సమాచారం మేరకు మండల పరిధిలోని సీతారాంపూర్ కు చెందిన చించేటి యాదయ్య (47) వృత్తి నిత్య కూలి రోజు మాదిరిగానే కూలి పని ముగించుకొని షాద్ నగర్ - కంది జాతీయ రహదారి పోతుగల్ గేటు సమీపాన రోడ్డు దాటే క్రమంలో షాబాద్ వైపు నుండి అతివేగంగా వస్తున్న అశోక్ లీలాండ్ వాహనం వేగంగా ఢీ కొట్టడంతో చించేటి యాదయ్య బలమైన గాయాలతో మృతిచెందగా చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతిని సోదరుడు చించేటి రవీందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతివేగంగా వాహనం నడిపిన అశోక్ లీలాండ్ డ్రైవర్ విశ్వనాథ్ (23) బేగంపేట్, హైదరాబాద్. పై కేసు నమోదు చేసి చట్టరీత్యా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



## కంటోన్మెంట్ బోర్డు పరిధిలో చెత్త కంపు

## ఇబ్బందులు పడుతున్న ప్రజలు..

**రెండో వార్డు గన్ బజార్ ప్రాంతంలో పేరుకుపోయిన చెత్త కుప్పలు**

**సికింద్రాబాద్ (జనంసాక్షి):** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని పారిశుధ్య విభాగం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు తీవ్ర ఇబ్బందులతో పాటు అనారోగ్య భారిన పడాల్సి వస్తుంది. రోడ్లపై చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్వాసనలు వెదజల్లుతున్నాయి. కారణంగా చిన్నపిల్లలు, వృద్ధులు రోగాల బారిన పడాల్సి వస్తుంది. రెండో వార్డు గన్ బజార్ ప్రాంతంలో పేరుకుపోయిన చెత్త కుప్పలు అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నాయి. దుర్వాసన వెదజల్లుతూ పరిసర ప్రాంత ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారిన సంబంధిత అధికారులు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్తను సమయానికి తొలగించకపోవడం వల్ల దోమలు, ఈగలు పెరిగి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ సరైన చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా బోర్డు అధికారులు కళ్ళు తెరచి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కంటోన్మెంట్ బోర్డు సీఈఓ అరవింద్ కుమార్ ద్వివేది, హెల్త్ సూపరింటెండెంట్ దేవేందర్ తక్షణమే స్పందించాలని విజ్ఞప్తి చేశారు. చెత్తను తొలగించాలా చర్యలు తీసుకొని, సమస్యను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేసారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని పలువురు హెచ్చరిస్తున్నారు.

